నూతన్‌కల్‌లో 'స్వచ్ఛత పక్వాడ'



నూతన్‌కల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని నూతన్‌కల్‌లో నిర్వహించిన 'స్వచ్ఛత పక్వాడ' కార్యక్రమంలో మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు గ్రామంలో పర్యటించి పరిసరాలను శుభ్రంచేసి స్వచ్ఛత గురించి వివరించారు. ఆరోగ్య చిట్కాలు చెప్పి గ్రామంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, వార్డు కార్యాలయం, ప్రైమరీ కేర్ సెంటర్ల ఆవరణలో శ్రమదానం చేసి ఆవరణలను శుభ్రం చేశారు. విద్యార్థులతో పాటు స్థానిక నాయకులు, వార్డు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



గోధుమకుంటలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని గోధుమకుంట హెవెన్ డౌన్ కాలనీలో నిర్మించనున్న డ్రైనేజీ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిరణ్‌జ్యోతిప్రవీణ్‌లు హాజరై కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. గ్రామశాఖ అధ్యక్షులు చీరకుమార్, మాజీ వార్డు సభ్యులు చీర శేఖర్, కాలనీ అధ్యక్షులు బండారి రమేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి వీరయ్య, సభ్యులు పాల్గొన్నారు.

విమోచనంపై వ్యాసరచన పోటీలు



కీసర: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా కీసర ఎంపీపీఎస్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్ర నిజాంపాలన నుంచి విముక్తి పొంది భారతదేశంలో విలీనమైన చారిత్రక ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

పోచారం: ఇళ్ల అవసరాలకోసం వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న వ్యక్తిపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. వెంకటాద్రి టౌన్‌షిప్‌లో ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు హరివర్ధన్‌రెడ్డి (28) డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నట్లు పోలీసులు మంగళవారం గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

స్నేహితుడి వైద్యానికి నగదు సాయం



స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

ఘట్‌కేసర్: కేన్సర్‌తో బాధపడుతున్న స్నేహితుడికి అతడి బాల్య స్నేహితులు ఎదులాబాద్‌లో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఎదులాబాద్ జెడ్పీ పాఠశాలలో 1999–2000వ విద్యాసంవత్సరం పదోతరగతికి చెందిన బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థి బాల నర్సింహ కేన్సర్ చికిత్స చేయించుకుంటున్నాడు. అతడి ఆర్థిక పరిస్థితిని గమనించిన అతడి బాల్య స్నేహితులు రూ.1,25,000 నగదు అందజేశారు.

ప్రభుత్వ స్కూల్‌లో హిందీ దివస్

కీసర: నాగారం ప్రభుత్వ స్కూల్‌లో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్ ప్రధానోపాధ్యాయులు పీసీ.రాములు మాట్లాడుతూ.. హిందీభాష దేశంలోనే ప్రజలను ఏకం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థుల ఉపన్యాసాలు, ఏకపాత్రాభినయం, నృత్యాలు నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయులు సంజయ్‌రాణి. అల్కా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లాలి ఆరోగ్యం.. ఇంటికి సౌభాగ్యం !

నేటి నుంచి పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య శిబిరాలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: అతివల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'స్వస్థ నారీ – సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. నేటి నుంచి వచ్చేనెల 2 వరకు నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏరియా ఆసుపత్రితో సహా మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 అర్బన్ హెల్త్‌సెంటర్లలో ప్రతిరోజు 11 ప్రత్యేక వైద్య శిబిరాల చొప్పున జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 121 వైద్య శిబిరాల (మెడికల్ క్యాంపులు) ద్వారా మహిళలకు వైద్య నిపుణులచే వైద్యపరీక్షలు, చికిత్సలు నిర్వహించనున్నారు. దీనికోసం తగిన కార్యాచరణ ప్రణాళికతో జిల్లా వైద్యారోగ్యశాఖ సన్నద్ధమవుతోంది.



అవగాహన లేక..

మహిళలకు ఆరోగ్యంపై సరైన అవగాహనలేక సకాలంలో వైద్య చికిత్సలు తీసుకోక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలో రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, క్షయ వంటి వ్యాధులతో మహిళలు బాధపడుతున్నారు. పోషకాహారంపై అవగాహన కల్పించడం, బలహీనంగా ఉన్న పిల్లలు, కిషోర బాలికలకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు. మానసిక ఆరోగ్య నిపుణులచే ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. వైద్యశిబిరాల విజయవంతానికి జిల్లా మహిళా సంక్షేమశాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ, విద్యాశాఖల సహకారం, సమన్వయంతో జిల్లా వైద్యారోగ్యశాఖ ముందుకుసాగనుంది.

వైద్య నిపుణులతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యానికి పెద్దపీట వేస్తున్నాయి. ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా అతివలకు ఇప్పటికే ప్రతి మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. తాజాగా మరో కార్యక్రమానికి బుధవారం నుంచి వైద్యారోగ్యశాఖ శ్రీకారం చుడుతోంది. 17 నుంచి అక్టోబరు 2 వరకు ప్రభుత్వ సెలవులు మినహాయించి ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహిస్తారు. తొలిరోజు బుధవారం మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అల్వాల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెగా వైద్యశిబిరాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు.

ఏయే పరీక్షలు చేస్తారంటే..

ఈనెల 17 నుంచి వచ్చేనెల 2 వరకు జరిగే ప్రత్యేక వైద్య శిబిరాల్లో మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ, హిమోగ్లోబిన్, గర్భాశయ, మూత్రాశయ, ఇతర క్యాన్సర్ సంబంధిత వ్యాధులు, దంత, చెవి, ముక్కు, చర్మ, గొంతు, మానసిక సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తారు. మహిళలకు ప్రసూతి (గైనకాలజీ), చిన్నపిల్లలకు కూడా ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన మందులు వారికి పంపిణీతో సహా కౌన్సిలింగ్, అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. ఇందుకోసం ప్రభుత్వ వైద్యకళాశాల వైద్యుల సహకారం తీసుకుంటారు. వ్యాధి నిర్ధారణైతే ప్రత్యేక కార్డులను జారీ చేస్తారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్యేక వైద్యశిబిరాలను అతివలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలి. వైద్యవిధాన పరిషత్, ప్రభుత్వ వైద్యకళాశాలకు చెందిన వైద్యనిపుణులు పరీక్షిస్తారు. ఆయా శాఖల సమన్వయంతో వైద్యశిబిరాలను విజయవంతం చేస్తాం. జిల్లాలోని మహిళలందరూ తప్పకుండా ప్రత్యేక వైద్య శిబిరాల్లో పాల్గొనాలి.

– డాక్టర్ సి. ఉమాగౌరీ, డీఎంహెచ్‌ఓ

తల్లీబిడ్డా.. ఆరోగ్యంగా ఉండేలా..

- నేటి నుంచి పోషణ్ అభియాన్ మాసోత్సవం
- గ్రేటర్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 3,307 అంగన్‌వాడీ కేంద్రాలు
- చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంఖ్య 3.75 లక్షలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మాతాశిశు సంరక్షణ చేస్తూ.. ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణమే లక్ష్యంగా ఏటా పోషణ్ అభియాన్ మాసోత్సవం నిర్వహిస్తున్నారు. నేటి నుంచి అక్టోబరు 16 వరకు గ్రేటర్ హైదరాబాద్ సహా మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిజిల్లాల్లో నెలరోజులపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆహారం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. వోకల్ ఫర్ లోకల్ అనే నినాదంతో గ్రామీణ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ.. మెరుగైన ఆహారపు అలవాట్లపై చైతన్యం నింపుతున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు ఒక్కో ప్రాజెక్టు రూ.30 వేలు, జిల్లాకు రూ.50 వేల నిధులను ప్రభుత్వం కేటాయించింది.

4 వారాల కార్యాచరణ ఇలా..

☛ మొదటి వారంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, పాలిచ్చే తల్లులతో పిల్లల పోషణపై సమావేశం నిర్వహిస్తారు. మహిళలతో పాటు పురుషులకు వంటల పోటీలు నిర్వహిస్తారు. బాలికలు, మహిళలకు బీఎంఐ పరీక్షలు, పిల్లల బరువు, ఎత్తు కొలిచి పోషకాహార ప్రతిజ్ఞలు చేయిస్తారు. స్థానిక ఉత్పత్తుల గురించి అవగాహన కల్పిస్తారు.

☛ రెండోవారంలో బిడ్డకు అందించే ముర్రుపాల విశిష్టత, అనుబంధ ఆహారంతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలి, ఆహారపు అలవాట్లపై అవగాహన సమావేశాలు నిర్వహిస్తారు. పోషణలో తండ్రుల భాగస్వామ్యం, బిడ్డ మొదటి వేయి రోజుల్లో మెదడు అభివృద్ధి గురించి వివరిస్తారు.

☛ మూడోవారంలో భాగంగా అతి తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తారు. ఎదుగుదల మానిటరింగ్‌లో హాజరుకాని పిల్లల బరువు, ఎత్తులను కొలుస్తారు. పోషణ లోపం ఉన్న పిల్లల ఇళ్లకు ఆశావర్కర్లు వెళ్లి వివరాలు సేకరిస్తారు.

☛ నాల్గో వారంలో భాగంగా తాగునీరు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, తక్కువ చక్కెర, నూనెలతో తయారు చేసే వంటకాలను ప్రదర్శిస్తారు. ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాల నిర్వహణ గురించి వివరిస్తారు. పాఠశాలల్లో వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షల నిర్వహణ, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తారు.

☛ గ్రేటర్ సహా మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారుల సంఖ్య ఈ విధంగా ఉంది.

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	లబ్ధిదారుల సంఖ్య
మేడ్చల్–మల్కాజిగిరి	703	1,27,401
హైదరాబాద్	914	1,19,800
రంగారెడ్డి	1600	1,28,797
మొత్తం	3,307	3,75,998

విస్తృత ప్రచారం చేపడతాం

నెలరోజులపాటు పోషకాహారం ప్రాధాన్యంపై విస్తృత ప్రచారం చేపడతాం. కార్యాచరణ ప్రణాళిక ప్రకారం ప్రాజెక్టుల వారీగా అంగన్వాడీ సిబ్బంది విధిగా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆదేశించాం.తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు,స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు భాగస్వామ్యం అయ్యేలా కృషి చేస్తాం.

– శారద, జిల్లా సంక్షేమ అధికారి

'రుణమాఫీపై ప్రభుత్వం మాట తప్పుతోంది'



ఘట్‌కేసర్‌లో రుణమాఫీ రిలే నిరాహార దీక్ష చేపట్టిన అన్నదాతలు

ఘట్‌కేసర్: రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని గాలికొదిలేసిందని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం రైతు రుణమాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్ అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన 'రిలే నిరాహార దీక్ష'ఏడో రోజుకు చేరుకున్న సందర్భంగా ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం అందరికి అన్నం పెట్టే అన్నదాతల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సాయిగౌడ్, రవీందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అర్జున్, సత్యనారాయణరెడ్డి దీక్ష చేపట్టగా లక్ష్మారెడ్డి, కష్టారెడ్డి, మహిపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఐలయ్యయాదవ్, దామోదర్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, ధర్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహేశ్వర్‌గౌడ్, హరినాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



దేవిడ్ చిత్రపటానికి నివాళులర్పించిన ట్రాఫిక్ పీఎస్ సిబ్బంది

పోచారం: నారపల్లిలోని ఘట్‌కేసర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డేవిడ్ ఈనెల 7న గుండెపోటుతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తరఫున సిబ్బంది అందరూ కలిసి ఆర్థికసాయంగా రూ.లక్ష మంగళవారం అందజేశారు. అనంతరం డేవిడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్సైలు మల్లయ్య, విజయ కృష్ణమూర్తి, మహిపాల్‌రెడ్డి, సోమయ్య, పీఎస్‌ఎన్ ప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన గురుకుల కళాశాల విద్యార్థినులు



విజేతలు శారన్, భవానితో ప్రిన్సిపల్ స్నేహలత

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహేంద్రహిల్స్ డిగ్రీ మహిళ కళాశాల లైఫ్ సైన్స్ విద్యార్థినులు సత్తాచాటారు. ఏఐఐఎంఎస్ బీబీనగర్ సైకియ్యాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'సోషల్ మీడియా ప్రభావం – యువతలో ఆత్మహత్యలు పెరగడం'... 'యువత ఆత్మహత్యలు తగ్గించడంలో కత్రిమ మేధస్సు పాత్ర'అనే అంశాలపై డిబేట్ నిర్వహించారు. ఈ పోటీలో కళాశాలకు చెందిన శారన్, భవాని మొదటి రెండు బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ స్నేహలత, వైస్ ప్రిన్సిపల్ కవిత, అధ్యాపకులు, కళాశాల ఇతర సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యబృందం

ఘట్‌కేసర్: పేదల కోసం దాతలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జ్యోతి అన్నారు. అంకుషాపూర్‌లో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల్ బుద్వేల్ డిగ్రీ మహిళ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నారపల్లి పీహెచ్‌సీ వైద్యబృందం సహకారంతో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానిక నేతలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ వీరాంజనేయ ఆలయంలో కమిటీ చైర్మన్ రాంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ డైరెక్టర్లతో కలసి శరన్నవరాత్రి, బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ మేయర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ.. నవరాత్రి పండుగను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో దుర్గామాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావును కలిసి సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన పండుగకు కావాల్సిన సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, పీఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, అనంతరెడ్డి, బుచ్చియాదవ్, దుర్గా, అజయ్‌రెడ్డి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిన తెలంగాణ సాయుధ పోరాటం

జవహర్‌నగర్: సీపీఐ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం 'తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుందాం' అనే అంశంపై జవహర్‌నగర్ దళితభవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వీఎస్.బోస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో నిలుస్తుందని, కర్ణాటక, మహారాష్ట్రలో స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించుకుంటున్నారన్నారు. ఇక్కడ విమోచన దినోత్సవం నిర్వహించడాన్ని వ్యతిరేకించారు. జిల్లా కార్యదర్శి ఉమామహేష్, నిమ్మల నర్సింహ, శ్యామలత, స్వరూప, జయమ్మ, కవిత, సత్యంసాగర్, ఎల్లయ్య, మల్లేష్, మల్లిక, కమలమ్మ, పద్మయాదవ్, పుష్పలత పాల్గొన్నారు.

42 ఏళ్ల తర్వాత చెరువు అలుగు



పోతాయిపల్లి చెరువు అలుగు వద్ద గ్రామస్తుల పూజలు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ, పోతాయిపల్లి చెరువు 42 ఏళ్ల తర్వాత అలుగు పారింది. రైతులతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత పూర్తిగా నిండి అలుగు పారడంతో గ్రామస్తులు, స్థానికులు పెద్ద ఎత్తున అక్కడి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ హరిబాబుగౌడ్, మాజీ ఉపసర్పంచ్ రాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ పదవికి ధర్మారెడ్డి రాజీనామా



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి డైరెక్టర్ పదవికి మంగళవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్‌లో ఆయన మాట్లాడుతూ... ఎఫ్ఎస్‌సీఎస్ అప్పటి ఎండీ అక్రమాలు, పాలకమండలి అలసత్వం, నిర్లక్ష్యంతోనే రుణమాఫీ కాలేదని ఆరోపించారు. ప్రభుత్వానికి పంపాల్సిన రైతు అర్హుల జాబిత ఆలస్యంగా పంపారన్నారు. రుణం తీసుకున్న రైతుల అప్పు ప్రభుత్వం మాఫీ చేయనందుకు నిరిసనగా రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

'ఐఎన్ఎస్ఏ' ఫెలోషిప్‌కు ఎంపిక



ప్రొఫెసర్ మహిపాల్‌రెడ్డి

జవహర్‌నగర్: బిట్స్ ఫిలానీ క్యాంపస్‌కు చెందిన ప్రొఫెసర్ బెంజరామ్ మహిపాల్‌రెడ్డి ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ) ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. జాతీయ, అంతర్జాతీయ శాస్త్రీయ సమాజంపై శాస్త్ర పరిశోధనలు చేసినందుకు ఆయనకు ఐఎన్ఎస్ఏ గుర్తింపు లభించిందని తెలిపారు. గ్రామీణ నేపథ్యం నుంచి ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రతిష్టాత్మక ఫెలోషిప్‌కు మహిపాల్‌రెడ్డి ఎంపిక కావడం అభినందనీయమని క్యాంపస్ యాజమాన్యం తెలిపింది.

'పదేళ్లుగా విమోచన దినాన్ని విస్మరించారు'

మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్: పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినాన్ని నిర్వహించడానికి విస్మరించారని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలందరూ విమోచన దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి లభించినందున సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవం నిర్వహించాల్సిన ప్రభుత్వాలు ఒక వర్గం ప్రజల కోసం జరపలేదన్నారు. కేసీఆర్ కొనసాగింపుగా కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సం నిర్వహించకపోవడం తెలంగాణ అమర వీరులు, ప్రజలు పోరాటాలను అవమానించడమేనని అన్నారు. నిజాం పాలనలో ఉన్న ప్రాంతాల్లో విమోచన దినోత్సవం నిర్వహిస్తున్నట్లుగానే తెలంగాణలో బీజేపీ గద్దెనెక్కగానే గోల్కొండ ఖిలాపై జాతీయ జెండాను ఎగురవేస్తామన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

జవహర్‌నగర్: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త నిరసనలు చేపట్టిన అంగన్‌వాడీ టీచర్లపై లాఠీచార్జీ చేసి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ, శివరాణిలు అన్నారు. మంగళవారం జవహర్‌నగర్‌లో అంగన్‌వాడీ టీచర్లు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొడంగల్‌లో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకురాలు జయలక్ష్మిలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం సరికాదన్నారు. అంగన్‌వాడీ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బడిలో సీసీ కెమెరాలు ప్రారంభం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న రైతు సహకార సంఘం మాజీ డైరెక్టర్ సత్తిరెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను రైతు సహకార సంఘం మాజీ డైరెక్టర్ సత్తిరెడ్డి మంగళవారం ప్రాంభించారు. అనంతరం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించేందుకు పూర్వ విద్యార్థుల సహకారం కావాలని కోరారు. బడులను అభివృద్ధి చేసుకోవడం అందరి కర్తవ్యంగా భావించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. పిల్లలను ఆకట్టుకునే బోధనా పద్ధతులను అవలంభించాలని కోరారు. సత్తిరెడ్డి మాట్లాడుతూ.. పిల్లలను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరారు. వారి ఎదుగుదలకు అందరి సహకారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, నాయకులు జితేందర్ నాయక్, కేఎం రెడ్డి, తిలక్ నాయక్, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, కొమ్ముల ప్రశాంత్, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



సాజన్‌కుమార్(ఫైల్)

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. సబ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... బిహార్‌కు చెందిన బిసంబర్ సైనీ ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం ఎదులాబాద్‌లోని రాంరెడ్డి గడ్డి పొలంలో పని చేస్తుండగా కుమారుడు సాజన్ కుమార్ (17) తండ్రితో కలిసి పనిచేస్తున్నాడు. అతడికి మతిస్థిమితం సరిగా ఉండదు. ఈనెల 8న కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. అతడి కోసం చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. గతంలోనూ ఘట్‌కేసర్ పీఎస్‌లో కేసు నమోదయ్యిందని తెలిపారు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

వైద్యం వికటించి యువతి మృతి

ఆసుపత్రి ఎదుట బంధువుల ధర్నా



రేణికుంట్ల శైలజ (ఫైల్)

మల్లాపూర్: వైద్యం వికటించి యువతి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాద్రాద్రి భువనగిరిజిల్లా, రాజపేట మండలం, చల్లూరు గ్రామానికి చెందిన రేణికుంట శైలజ (20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. 13న ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు మొదటగా భువనగిరిలో చూపించారు. వైద్య పరీక్షలు చేయగా అపెండిసైటిస్ అని తేలింది. దీంతో భువనగిరి నుంచి నేరుగా నాచారం స్నేహపురి కాలనీలోని ఓ మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ రక్తం ఎక్కించి, అనంతరం 14న అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు. పరిస్థితి విషమించడంతో ఉప్పల్‌లోని టీఎక్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ప్రాణాలకు హామీ ఇవ్వకపోవడంతో సికింద్రాబాద్‌లోని మెడికోవర్ ఆసుపత్రిలో చేర్పించారు. సోమవారం సాయంత్రం 7.30 గంటలకు యువతి మృతి చెందింది. అర్ధరాత్రి మృతదేహాన్ని తీసుకొచ్చి నాచారం స్నేహపురికాలనీలోని మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. మృతికి కారణమైన డాక్టర్, ఆసుపత్రిని సీజ్ చేయాలని మంగళవారం తెల్లవారుజాము 4 గంటల వరకు భీష్మించుకుని కూర్చున్నారు. ఆసుప్రతి యాజమాన్యం బాధిత కుటుంబానికి పరిహారం ఇస్తామని చెప్పడంతో ధర్నాను విరమించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.